
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం, 3, మే, 2024



సోమశిలలో 8.13 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 8.137 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.73,530
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,585
3శాతం జీఎస్టీతో	రూ.6,783
నవర (8గ్రాములు)	రూ.54,264



మద్యం సీసాల స్వాధీనం

మర్రిపాడులోని చిన్నమాచనూరు సెంటర్‌లో వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

8లో

న్యూస్‌రీల్

వీఎస్‌యూ అధ్యాపకుడికి అవార్డు



అవార్డును అందజేస్తున్న సుందరవల్లి

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో సోషల్ వర్క్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న వెంకటసుబ్బారెడ్డికి ఆదర్శ విద్యా సరస్వతి రాష్ట్రీయ పురస్కారాన్ని వీసీ సుందరవల్లి గురువారం అందజేశారు. వెంకటసుబ్బారెడ్డి సేవలను గుర్తించిన గుజరాత్‌లోని గ్లోబల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ఈ అవార్డును ప్రకటించింది. ఆయన్ను వీసీతో పాటు రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు అభినందించారు.

'పది' మార్కుల మెమోల విడుదల

నెల్లూరు(అర్బన్): పదో తరగతి ఫలితాలకు సంబంధించిన మార్కుల షార్ట్ మెమోలను bse.ap.gov.inలో వెబ్‌సైట్‌లో ఉంచారని డీఈఓ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ లాగిన్‌లో విద్యార్థులకు సంబంధించిన రోల్ నంబర్‌ను క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. అనంతరం వీటిపై అటెస్ట్ చేసి విద్యార్థులకు అందజేయాలని సూచించారు. తుది మార్కుల జాబితాలు వచ్చేంత వరకు పైచదువుల అడ్మిషన్లకు వీటిని వినియోగించుకోవచ్చని చెప్పారు.

నేటి నుంచి ములాఖత్ వేళల్లో మార్పు

నెల్లూరు(క్రైమ్): వేసవి తీవ్రత నేపథ్యంలో జిల్లాలోని సబ్ జైళ్లలో ములాఖత్ వేళలు ఉదయం 8 నుంచి 11 వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ఉంటాయని జిల్లా సబ్ జైళ్ల అధికారి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేళలు శుక్రవారం నుంచి జూన్ 15 వరకు వర్తించనున్నాయని చెప్పారు. ఈ మార్పును గమనించాలని కోరారు.

పటిష్టంగా హోమ్ ఓటింగ్ ప్రక్రియ

- నెల్లూరు సిటీ ఆర్వో వికాస్ మర్మత్



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నుంచి చేపట్టనున్న హోమ్ ఓటింగ్ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎన్నికల మైక్రో అబ్జర్వర్లు, హోమ్ ఓటింగ్ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 153 మంది వృద్ధులు, దివ్యాంగులు హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరందరూ తమ గృహాల్లోనే ఉండి ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రణాళికలను సిద్ధం చేశామని వివరించారు. ఓటింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశామని చెప్పారు. ఐదుగురు ఎన్నికల అధికారులకు సెక్టార్ల వారీగా బాధ్యతలను అప్పగించామని తెలిపారు. ఓటర్లను వారి గృహాల్లో కలిసి ఓటు హక్కు వినియోగాన్ని ముందుగా తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్ల గృహాలను మార్క్ చేసి.. నిర్దిష్టమైన రూట్ మ్యాప్‌నకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ హోమ్ ఓటింగ్ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నేడు



ఏఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నియమించిన సిబ్బందికి శిక్షణ తరగతులను స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శుక్ర, శని వారాల్లో నిర్వహించనున్నామని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణకు నియమించిన పీఓ, ఏపీఓలు శిక్షణకు విధిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

అంతా అయోమయం..

అవ్వాతాతలకు అవే కష్టాలు

- పింఛన్ల కోసం పడిగాపులు
- బ్యాంకుల వద్దకు వెళ్లలేక అగచాట్లు
- వెళ్లినా తప్పని నిరీక్షణ
- చంద్రబాబుకు శాపనార్థాలు

పెనం నుంచి పొయ్యిలోకి పడిన చందంగా మారింది అవ్వాతాతల పరిస్థితి. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా 3.15 లక్షల మంది పింఛనర్లకు ప్రతి నెలా రూ.94.38 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమానని వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు అందుకుంటూ వీరెంతో సుఖంగా ఉండేవారు. మందులు.. ఇతరత్రా అవసరాలకు ఈ నగదు ఎంతో చేదోడువాదోడుగా ఉండేది. అయితే టీడీపీ కుట్ర ఫలితంగా రెండు నెలలుగా వీరి అగచాట్లు వర్ణనాతీతమయ్యాయి. గత నెల్లో సచివాలయాల వద్దకెళ్లి పింఛన్లు పొందే పరిస్థితి ఉండింది. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసే విధానానికి శ్రీకారం చుట్టారు. అయితే ఈ ప్రక్రియ పండుటాకులు, దివ్యాంగులకు అశనిపాతంలా పరిణమించింది. బ్యాంకులకెళ్లి ఫారాలు నింపడం ఓ ఎత్తయితే.. వారి ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ ఉంటుందాననేది సందేహమే. జమైన నగదులో మినిమమ్ బ్యాలెన్స్ పేరిట కొంతమేర నగదు కోతకు గురైతే వీరికి అందేది ఎంత..? అసలు ఎన్ని ఖాతాలు ఇన్ ఆపరేటివ్‌లో ఉన్నాయో చెప్పలేని పరిస్థితి. ఈ పరిణామాల క్రమంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. తమను ఇబ్బందులకు గురిచేసిన చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్తామని పింఛన్‌దారులు తేల్చిచెప్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సంగంలోని బ్యాంక్ వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

మా ఉసురు తగులుతుంది



మాలాంటి వారికి అందించే పింఛన్లలో ఇబ్బందులకు గురిచేస్తున్న చంద్రబాబుకు ఉసురు తగులుతుంది. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్ నగదును ఇచ్చేవారు. గత నెల్లో చంద్రబాబు తన వ్యక్తులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రంలోని బ్యాంకులకెళ్లి డబ్బు తీసుకోవాలంటే వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది తప్పదు. రానున్న ఎన్నికల్లో ఓటుతో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్తాం.

– వింతా కృష్ణారెడ్డి, నరసారెడ్డిపాళెం, కలిగిరి మండలం

మండుటెండలో వెళ్లి నగదు తెచ్చుకోగలనా..?



ప్రతి నెలా ఒకటో తేదీన తలుపు తట్టి వేకువజామునే పింఛన్‌ను వలంటీర్ అందించేవారు. టీడీపీ వాళ్లు కేసు వేయడంతో డబ్బులు పంపిణీ చేయొద్దని వలంటీర్లకు చెప్పారట. గత నెల్లో గ్రామ సచివాలయానికి మండుటెండలో రెండు రోజుల పాటు తిరిగి పింఛన్ తెచ్చుకోగలిగా. ఈ నెల్లో బ్యాంక్‌లో వేశామని చెప్తే ఎండలో 11 గంటలకు వెళ్లగా, సాయంత్రం నాలుగింటికి రమ్మన్నారు. ఈ ఎండల్లో వెళ్లి పింఛన్ నగదు తెచ్చుకోవడం నా వల్ల అయ్యే పనేనా..? జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే ఈ బాధలుండవు. వృద్ధులను ఇబ్బంది పెడుతున్న చంద్రబాబుకు మా ఉసురు తప్పక తగులుతుంది.

– సురె పద్మావతమ్మ, జలదంకి

మాపై ఎందుకింత కక్ష చంద్రబాబూ..?



మాపై చంద్రబాబుకు ఎందుకింత కక్షో అర్థం కావడంలేదు. ప్రతి నెలా వచ్చే పింఛన్‌తో బతికే మాలాంటి వారికి డబ్బులు రానీయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో తెలియడంలేదు. పింఛన్ కోసం సచివాలయానికి వెళ్తే బ్యాంక్‌లో పడుతుందన్నారు. బ్యాంక్ వాళ్లు జమకాలేదని చెప్తున్నారు. పొదుపు.. సున్నా.. అని ఇలా రెండు ఖాతాలు తెరిచారు. ఇప్పుడు అందులో వేస్తే రూ.వెయ్యి కట్ చేస్తారంట. అసలు ఏ బ్యాంక్‌లో పడిందో అర్థం కావడంలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమానని రెండు నెలల ముందు వరకు పొద్దున్నే ఇంటికొచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు నరకం కనపడుతోంది. మాపై పగబట్టే చంద్రబాబు ఇలా చేస్తున్నారు.

– గోసుల శేషమ్మ, ఉలవపాడు

ఆయన వల్లే ఈ కష్టాలు



చంద్రబాబు తీరుతో వృద్ధులు నానా పాట్లు పడుతున్నారు. వలంటీర్లతో సజావుగా సాగుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆయన అడ్డుకున్నారు. ఈ క్రమంలో వృద్ధుల అగచాట్లు తీవ్రమవుతున్నాయి. బ్యాంకుల్లో జమైన నగదును తెచ్చుకునేందుకు నానా కష్టాలు పడుతున్నాం. పొదలకూరులోని కెనరా బ్యాంక్‌లో పింఛను సొమ్మును జమచేసినట్లు తెలిసింది. అయితే అక్కడికెళ్లగా వేలిముద్రలు పడలేదని తిప్పి పంపారు. 75 ఏళ్ల వయస్సులో మండుటెండలో ఎన్నిసార్లు బ్యాంక్‌కు వెళ్లాలో తెలియడం లేదు. నాతో పాటు వచ్చేందుకు ఎవరూ లేరు.

– మద్దూరు రామిరెడ్డి, మొగళ్లూరు, పొదలకూరు

ఇలా వ్యవహరించడం తగదు



ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేవారు. దీని ద్వారా ఎంతో సుఖంగా ఉండేవాళ్లం. అయితే గత నెల నుంచి మాకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇదంతా చంద్రబాబు వల్ల జరగడం దారుణం. మా ఖర్మ కాలి ఆయనొస్తే పరిస్థితి ఏమిటో ఊహించాలంటేనే భయంగా ఉంది. వీలైతే సాయం చేయాలే గానీ ఇలా వ్యవహరించకూడదు.

– చింతంరెడ్డి వెంగళరెడ్డి, దేవరాయపల్లె, అనంతసాగరం

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- నమ్మితే నట్టేట ముంచడం ఆయన నైజం
- రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జగనన్నను ఆశీర్వదించండి
- వైఎస్సార్‌సీపీ కోవూరు అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని పల్లిపాడు, నాగరాజుతోపు, ముదివర్తిపాళెం, జగదేవిపేట, లేబూరు, పున్నూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలొచ్చాయంటే ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ఎన్ని అబద్ధాలనైనా వల్లిస్తారని మండిపడ్డారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు హామీలివ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. చంద్రబాబును 'ఆల్ ఫ్రీ బాబు' అని దివంగత సీఎం వైఎస్సార్ సంబోధించిన అంశాన్ని గుర్తుచేశారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో దేన్నీ చంద్రబాబు అమలు చేయలేదని, ప్రస్తుత మేనిఫెస్టో పరిస్థితి సైతం ఇదేననే అంశం ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. బాబొస్తే జాబు గ్యారెంటీ అని ప్రచారం చేసి, చివరికి నిరుద్యోగులకు అన్యాయం చేశారని మండిపడ్డారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

పేదల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రసన్న తెలిపారు. వలంటీర్ల సేవలు అద్భుతమని కొనియాడారు. పేదలకు.. పెత్తందారులకు మధ్య ఈ ఎన్నికల పోరు జరుగుతోందని తెలిపారు. సీఎం సారథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకునేందుకు దుష్టశక్తులన్నీ ఏకమయ్యాయని, చివరికి వైఎస్సార్ కుమార్తె షర్మిలను సైతం రంగంలోకి దింపి.. కాంగ్రెస్ పార్టీలో చేర్చి ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంతమంది ఏకమైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయమని స్పష్టం చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 1,01,200 గడపలను పలకరించానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి.. కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నిడిముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, గూడూరు జయరామయ్య, వరిగొండ బాబయ్య, గోద సుధాకర్, మనోహర్, రామయ్య, పరమయ్య, గొల్లపల్లి అవినాష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూటకో పార్టీ మారే వారిని నమ్మొద్దు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి
- ఆత్మకూరులో ముమ్మర ప్రచారం



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: కూటమి తరఫున లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు పూటకో పార్టీ మారే వ్యక్తులని, ఇలాంటి వారిని నమ్మితే అభివృద్ధి శూన్యమనే అంశాన్ని ప్రజలు గ్రహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 14 నుంచి 20వ వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ ఆత్మకూరు అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డితో కలిసి విజయసాయిరెడ్డి గురువారం నిర్వహించారు. అనంతరం హిల్ రోడ్డు వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి గడిచిన ఐదేళ్లలో పరుగులు తీశాయని చెప్పారు. రాష్ట్రంలోని ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా, ఏదో ఒక సంక్షేమం అందని కుటుంబమే ఉండదని తెలిపారు.

సీఎంపై విమర్శలు హాస్యాస్పదం

టీడీపీ ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తన స్వలాభం కోసం ఇప్పటికే పలు పార్టీలు మారారని పేర్కొన్నారు. సీఎంపై ఆయన విమర్శలు చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. నిలకడలేని ఆయనకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి చేశానని ఆయన చెప్పుకొంటున్నారని, అయితే అవి దివంగత సీఎం వైఎస్సార్, కాంగ్రెస్ హయాంలో జరిగినవని గుర్తుచేశారు. ప్రత్యేక ప్రణాళికతో ఆత్మకూరును అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తన సోదరుడు.. దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఏడీఎఫ్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నారని కొనియాడారు.

అభివృద్ధి అంటే ఇది..

ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.20 లక్షలతో డిజిటల్ తరగతుల ఏర్పాటు.. మెగా జాబ్ మేళాలను మూడుసార్లు నిర్వహించి ఆరు వేల మందికిపైగా ఉద్యోగాలను కల్పించారని కొనియాడారు. గ్రూప్ - 2 తదితర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు రూ.నాలుగు లక్షల విలువైన మెటీరియల్‌ను ఉచితంగా అందజేసిన ఘనత విక్రమ్‌రెడ్డికే దక్కుతుందని అభినందించారు. ఎమ్మీఆర్ పేరిట రూ.4.5 కోట్లతో మున్సిపల్ బస్టాండ్‌ను ఏడీఎఫ్ నిధులతో నిర్మించారని, అభివృద్ధి అంటే ఇదేనని చెప్పారు.

మైనార్టీకి టికెటిస్తే సహించలేకపోయారు

నెల్లూరు సిటీ టికెట్‌ను మైనార్టీకి సీఎం కేటాయించడాన్ని జీర్ణించుకోలేక పార్టీని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీడారని విమర్శించారు. కూటమి అభ్యర్థులకు బుద్ధి చెప్పేందుకు మైనార్టీలు సిద్ధంగా ఉన్నారని, ఆత్మకూరులోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. తొలుత వీరికి మహిళలు ఘన స్వాగతం పలికారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, రిజ్వాన్, రహీం, జమీర్, కలామ్, కేతా రవిరెడ్డి పాల్గొన్నారు.



హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళ

ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టర్ హరినారాయణన్



నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై ఆర్వోలతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఓటు వినియోగంపై రానున్న పది రోజుల్లో స్వీప్ కార్యక్రమాలను ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. ఈవీఎంల కమిషనింగ్.. పోలింగ్ అధికారులకు శిక్షణ.. డిస్ట్రిబ్యూషన్.. రిసెప్షన్ సెంటర్లు.. పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు.. కుర్చీలు.. తాగునీటి వసతి.. తదితరాల కల్పనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓటరు హెల్ప్‌లైన్ కేంద్రాలను అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మున్సిపాల్టీల్లో శనివారంలోపు ఏర్పాటు చేయాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకునేందుకు సంబంధించిన ఫెసిలిటేషన్ సెంటర్లపై అందరికీ తెలిసేలా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్‌ను ఏర్పాటు చేయనున్నామని, వీటిని వినియోగించుకునేలా బీఎల్‌ఓలు చర్యలు చేపట్టాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలకు 703 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 703 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 5134 మందికి గానూ 4737 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 4205 మందికి గానూ 306 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

వారొస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు



రోడ్‌షోలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



భారీగా హాజరైన ప్రజలు

నెల్లూరు సిటీ: ముస్లింల సంక్షేమం కోసం నాలుగు శాతం రిజర్వేషన్లను దివంగత సీఎం వైఎస్సార్ కల్పించారని, అయితే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే వీటిని వెంటనే రద్దు చేయడం ఖాయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 29వ డివిజన్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లను రద్దు చేయడం ఖాయమనే అంశాన్ని బీజేపీ అగ్రనేతలే తెలియజేశారని, ఈ విషయమై ముస్లింలు ఆలోచించాలని కోరారు. మహిళా సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, ఈ కారణంగానే అన్ని సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఇప్పటి వరకు మంచి చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లోనూ గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ సత్తార్, మేయర్ స్రవంతి, పార్టీ నేతలు ఆనం జయకుమార్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, ఏసునాయుడు, బద్దిపూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- నేటి నుంచి హోం ఓటింగ్
- 126 మంది దరఖాస్తు
- సబ్‌కలెక్టర్ విద్యాధరి



మాట్లాడుతున్న విద్యాధరి

కందుకూరు: ఈనెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం ఏర్పాట్లు చేస్తున్నామని, ఓటర్ల కోసం సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని సబ్‌కలెక్టర్ విద్యాధరి తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నూతనంగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్ విధానం నియోజకవర్గంలో 3, 4, 5 తేదీల్లో జరుగుతుందన్నారు. అన్ని మండలాల ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇప్పటికే దీనిపై సమాచారం ఇచ్చామని చెప్పారు. అన్ని మండలాల్లో కలిపి 4,533 మంది హోం ఓటింగ్‌కు అర్హులుగా గుర్తించామని, అయితే వీరిలో 126 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికి హోం ఓటింగ్ విధానంలో ఓటు వేసే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే మూడు రోజుల్లో ఓటు వేయలేని వారికి తిరిగి 8, 9, 10 తేదీల్లో మరోసారి అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈనెల 8వ తేదీ వరకు ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,28,913 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈవీఎం ర్యాండమైజేషన్ కార్యక్రమం శుక్రవారం నుంచి స్థానిక టీఆర్ ఆర్ కాలేజీలో ప్రారంభం అవుతుందన్నారు. మొదట పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను, తర్వాత అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలను ర్యాండమైజేషన్ చేస్తామని వివరించారు. ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, అకౌంటింగ్ బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని, ఎన్నికల విధానంలో ఎక్కడా లోపాలు లేకుండా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. బీఎల్‌ఓలు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారని, ఎన్నికల రోజు టెంట్‌లు వేయించడంతో పాటు, తాగునీటి సౌకర్యం, కల్పిస్తామన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 271 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రజలు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

మద్యం దుకాణాలు, బార్లలో తనిఖీలు విస్తృతం

- రూ.1.20 కోట్ల విలువ చేసే మద్యం స్వాధీనం
- 23 మంది అరెస్ట్



వివరాలు తెలుసుకుంటున్న ఈఎస్ (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా కట్టడికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.నాగమల్లేశ్వరరెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లలో విస్తృత తనిఖీలు చేయిస్తున్నారు. అనధికార మద్యం విక్రయాలను గుర్తించి 17 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.20 కోట్ల విలువ చేసే 79,492 మద్యం బాటిళ్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడిన 23 మంది సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గతేడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎంత మేర విక్రయాలు జరిగాయో అంతే మద్యంను ప్రభుత్వ దుకాణాలకు, బార్లకు సరఫరా చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. అక్రమ రవాణా, నిల్వలు, ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లలో అవకతవకలపై 0861 – 2331159కు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఈఎస్ వెల్లడించారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 248
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 278
లేయర్ చికెన్	: 145



నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.92
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

అభివృద్ధిని అడ్డుకోవడం చంద్రబాబు నైజం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: అభివృద్ధి, సంక్షేమ పథకాలను అడ్డుకోవడమే చంద్రబాబు నాయుడి నైజమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనుపూరు, చెముడుగుంట గ్రామాల్లో గురువారం మంత్రి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనే లేదని తెలియజేశారు. 2014లో బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని సీఎం అయ్యాడని, కానీ రాష్ట్రానికి మంచి చేయలేదన్నారు. వందల సంఖ్యలో హామీలిచ్చి గాలికొదిలేశాడని మండిపడ్డారు. మరోసారి జనసేన, మతతత్వ బీజేపీతో కలిసి ప్రజలను మోసం చేసేందుకు వచ్చాడని చెప్పారు. 2019లో లాగే మళ్లీ బాబుకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల లబ్ధిదారులకు నగదు అందజేశారన్నారు. టీడీపీ అధ్యక్షుడు తన మనుషుల చేత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నాడని విమర్శించారు. చంద్రబాబు నిర్వాకం వల్ల వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

బాబుపై ఆగ్రహం

అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడం చంద్రబాబుకు చేతకాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేస్తుంటే అడ్డుకోవడం ఏమిటని ఆయనపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని కాకాణి తెలియజేశారు. పేదలకు అండగా నిలిచి దేశ చరిత్రలో అత్యంత ప్రజాదరణ గల సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని కొనియాడారు. సీఎం సభలకు వచ్చే జనాన్ని చూసి మరోసారి ఓటమి తప్పదని బాబుకు అర్థమైపోయిందన్నారు. ప్రజాగళం సభలకు ప్రజలు మద్దతు లేకపోవడంతో జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని తెలియజేశారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన తనకు మరోసారి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైస్ ఎంపీపీ పచ్చబట్ల మస్తానయ్య, పార్టీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, కనుపూరు సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, నాయకులు కొణిదెన విజయభాస్కర్ నాయుడు, మంచు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



జన సందోహం నడుమ సాగుతున్న కాకాణి రోడ్‌షో



కనుపూరులో మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

జగన్ పాలనలోనే దళితులకు న్యాయం

- కందుకూరులో అభ్యర్థి మధుసూదన్ యాదవ్‌కే మద్దతు
- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య



మాట్లాడుతున్న మధుసూదన్ యాదవ్, చిత్రంలో చెన్నయ్య

కందుకూరు: 'చంద్రబాబు నాయుడు దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ చులకనగా మాట్లాడాడు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నా వాళ్లంటూ ఎస్సీలకు అండగా నిలిచారు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే దళితులకు అన్ని విధాలా న్యాయం జరిగింది' అని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో దళితులంతా బుర్రాకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కరోనా కాలంలో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతునప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఏమైపోయారని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ అన్ని వ్యవస్థలను సమన్వయం చేసి ప్రజలకు అండగా నిలిచారన్నారు. బుర్రా సొంత నిధులు వెచ్చించి సేవ చేశారని గుర్తు చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని చెప్పారు. ఇటువంటి నాయకులను రాష్ట్రం నుంచి తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా దళితులకు సీఎం జగన్ నామినేటెడ్ పదవులిచ్చి రాజకీయంగా ప్రోత్సహించారన్నారు. అదే టీడీపీ హయాంలో బాబు కుటుంబం ఆర్థికంగా బలోపేతమైంది తప్ప దళితులకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. నాడు కారంచేడు ఘటనలో పురందేశ్వరి కుటుంబానిదే కీలకపాత్ర అని వివరించారు. వచ్చే ఎన్నికల్లో దళితులు వైఎస్సార్‌సీపీ వెంట ఉండి ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

టీడీపీని నమ్మొద్దు

మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచేందుకు తెలుగుదేశం నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని వారిని నమ్మొద్దన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరులకు కూడా సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. చంద్రబాబు ఎప్పుడూ పెత్తందార్లు, భూస్వాముల పక్షాన ఉంటే, జగన్ పేదల పక్షాన నిలిచారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత నాయకులు డీసీహెచ్ మాలకొండయ్య, జి.నర్సయ్య, ధనకోటి, కోటేశ్వరరావు, గేరా సంగ్రాం, గేరా జయపాల్, తాటితోటి రాఘవ, నరసింహం, జె.రవి, జి.రేవంత్, బాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు)లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ విజయభాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను లాటరీ ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. 3వ తరగతిలో 40 సీట్లు, 4లో 26, 5లో 28 సీట్లు భర్తీ చేయనున్నా మని, ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

- కోట: స్థానిక ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను లాటరీ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీశోభాన్విత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 31 సీట్లు, 4 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ 93 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 20వ తేదీలోపు పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94419 37594లో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాల చేరిక

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ యువత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపడం ఆనందంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో విజయ్ ప్రదీప్, ఉపేంద్ర, శ్రీహరి, కిశోర్, చరణ్, సుధీర్, జగన్ తదితరులున్నారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైవీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదాలను గజమాలతో సత్కరిస్తున్న యువకులు

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాబీ

నెల్లూరు(క్రైమ్): రవితేజ అనే వ్యక్తి హత్య కేసులో ఆరుగురు నిందితులను నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో హత్యకు దారి తీసిన పరిస్థితులు, నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ వెల్లడించారు. దళితవాడకు చెందిన రౌడీషీటర్ పుట్టా బాలాజీ గతనెల 28వ తేదీ రాత్రి జాకీర్‌హుస్సేన్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. స్థానికంగా ఉన్న సాజిద్, సుల్తాన్ స్పీడుగా ఎందుకు వెళ్తున్నావని అతడిని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. సాజిద్, సుల్తాన్ దాడి చేయడంతో బాలాజీకి గాయాలయ్యాయి. దీంతో అతను ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన సోదరుడు చంద్రశేఖర్, స్నేహితులు శ్యామ్ అలియాస్ అంబాకబ్, బాబు, మరో ఇద్దరు మైనర్లకు తెలియజేశాడు. అందరూ కలిసి జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు వెళ్లి సాజిద్, సుల్తాన్‌పై దాడి చేయసాగారు. స్నేహితుడిని కొడుతున్నారన్న విషయం తెలుసుకున్న జి.రవితేజ ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను వారించే ప్రయత్నం చేశాడు. వారు కర్రతో రవితేజ తలపై దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులు పరారయ్యారు. మృతుడి తండ్రి శేషాద్రి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఆరుగురిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన కర్రలు, మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు కృషిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు ఎస్‌ఏ రెహ్మాన్, సీహెచ్ చంద్రావతి, ఎం.జోజి, హెచ్‌సీ పవన్ కుమార్, కానిస్టేబుల్స్ రత్నయ్య, సురేంద్రబాబు, మోహన్‌బాబు, వేణు, మస్తానయ్య, వెంకటేశ్వర్లు, బి.మస్తానయ్యను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

అక్రమ రవాణాపై కొనసాగుతున్న దాడులు

నెల్లూరు(క్రైమ్): నగదు, మద్యం అక్రమ రవాణాపై పోలీసు, ఎస్ఈబీ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు మర్రిపాడు పరిధిలో రూ.45 వేలు, టీడీపీ కరపత్రాలు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. బిట్రగుంటలో 80, జలదంకిలో 45, దగదర్తిలో 41, మనుబోలులో 15, సెబ్ అధికారులు 219 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. మనుబోలు పరిధిలో 1,600 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు.

మద్యం, నగదు, సెల్‌ఫోన్ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

మర్రిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని చిన్న మాచనూరు సెంటర్‌లో గురువారం అధికారులు, పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. నెల్లూరు నుంచి ఉదయగిరికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో 36 మద్యం బాటిళ్లు, రూ.21 వేల నగదు, సరైన బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న 46 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ జి.వేణు తెలిపారు. కేసు నమోదు చేశారు. తనిఖీల్లో రామ్‌ప్రసాద్, ఎస్సై విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రథమ స్థానంలో అదానీ వరల్డ్ స్కూల్



సైనిక్ స్కూల్ విద్యార్థులు

ముత్తుకూరు : సైనిక్ స్కూల్ సొసైటీ ప్రణాళిక అమలు పరిచే విధానంలో దేశంలో కొత్తగా ఏర్పాటు చేసిన 19 స్కూల్స్‌లో కృష్ణపట్నం అదానీ వరల్డ్(సైనిక్) స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ సైనిక్ స్కూళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా రాష్ట్రాలు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రక్షణ మంత్రిత్వశాఖ ద్వారా 100 కొత్త సైనిక్ స్కూల్స్‌ను స్థాపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

చేజర్ల : వడదెబ్బతో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని మడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మడపల్లికి చెందిన పెద్దిరెడ్డి రాఘవరెడ్డి (63) గురువారం బట్టీల వద్దకు వెళ్లాడు. తిగిరి వస్తుండగా వడదెబ్బ తగిలి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పర్యటన

నెల్లూరు సిటీ: నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద నుంచి వీఆర్సీ సెంటర్ వరకు శుక్రవారం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రోడ్‌షో జరుగుతుందని టీడీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ గ్రౌండ్స్‌లో సాయంత్రం బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

పాండిచ్చేరి మద్యంపై ఆరా

సూళ్లూరుపేట: ఆంధ్రా–తమిళనాడు రాష్ట్ర సరిహద్దుల్లోని తడ మండలం భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద బుధవారం స్వాధీనం చేసుకున్న 300 బాక్సుల మద్యం ఎవరిదనే విషయం తెలుసుకోవడం కోసం పరిశోధనలు చేస్తున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సోమయ్య తెలిపారు. గురువారం ఆయన ఎక్సైజ్ కార్యాయలంలో విలేకరులతో మాట్లాడుతూ 300 బాక్సులు, 14,400 క్వార్టర్ బాటిళ్ల మద్యం పాండిచ్చేరి నుంచి మనరాష్ట్రంలోకి మినీలారీ ద్వారా తీసుకొస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. పాండిచ్చేరికి చెందిన స్వామినాథ్, షరూన్ అనే ఇద్దరు వ్యక్తులు ఫిరోజ్ అనే డ్రైవర్ ద్వారా ఈ మద్యాన్ని ఏపీలోకి పంపించారని చెప్పారు. ఈ మద్యం ఎన్నికల్లో ఓటర్లకు పంపకానికే అనే విషయం అర్థమవుతోందన్నారు. వెహికల్ డ్రైవర్ ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా స్వామినాథ్, షరూన్ పేర్లు వెల్లడించారని, వారిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తే ఈ మద్యాన్ని ఎవరికి పంపారో తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ మద్యం విలువ పాండిచ్చేరిలో రూ.7.48 లక్షలు చేస్తుందని, ఇదే మద్యం ఏపీలో అయితే రూ.18 లక్షలు ఉంటుందని తెలిపారు.

ముత్యాలమ్మకు పొంగళ్లు

దిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో గత నెల 2న అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం నెల పొంగళ్లు పెట్టారు. తూర్పుకనుపూరు పంచాయతీలోని తూర్పుకనుపూరు, ఈదులవారిపాళెం, పోసినవారిపాళెం, రావులవారిపాళెం, కొమరావారిపాళెం గ్రామాలకు చెందిన మహిళలు పోలేరమ్మ గుడి వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పొంగళ్లు పెట్టారు. ఈవో నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, సాయిక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ అగచాట్లు

- పండుటాకులపై పగబట్టిన చంద్రబాబు
- పెన్షన్ నగదు కోసం బ్యాంకుల వద్ద అవ్వాతాతల పడిగాపులు
- ఎండ తీవ్రతకు అల్లాడిన వృద్ధులు, దివ్యాంగులు

నెల్లూరు(పొగతోట): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితర పింఛన్ లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ నగదును వలంటీర్ల ద్వారా వారి ఇంటి వద్దే అందిస్తుండగా.. చంద్రబాబు, ఆయన అనుచరగణం అగచాట్లు తెచ్చిపెట్టింది. వలంటీర్ల సేవలను అడ్డుకుని పింఛన్ నగదు లబ్ధిదారులకు ఇంటి వద్దే అందకుండా చేయడంతో వారు నానా తిప్పలు పడుతున్నారు. పింఛన్ నగదు కోసం తీవ్రమైన ఎండలో బ్యాంకుల వద్ద అవ్వాతాతలు పడిగాపులు కాయాల్సి వస్తోంది. నగదు డ్రా చేసుకోవడానికి గంటల తరబడి క్యూలో ఎదురుచూడాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రంలో ఉన్న బ్యాంకుల వద్దకు రావడానికి అవ్వాతాతలు నానా ఇబ్బందులు పడ్డారు. చంద్రబాబు పాలనలో పింఛన్ నగదు కోసం పడిన అవస్థలు గుర్తుకు వచ్చాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల్లో జిల్లా యంత్రాంగం లబ్ధిదారుల కోసం ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది.

వలంటీర్ల ద్వారా నేరుగా..

జిల్లావ్యాప్తంగా 3.15 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారికి ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు రూ.94.38 కోట్ల నగదును వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల వద్దకే వెళ్లి పంపిణీ చేసేది. వలంటీర్లు పింఛన్ నగదు పంపిణీతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో కీలకంగా వ్యవహరించేవారు. ఇలా వలంటీర్లు ప్రజలకు దగ్గర కావడంతో వారిని కుటుంబసభ్యులుగా భావించేవారు. గత నాలుగున్నరేళ్లుగా ఇలా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించేవారు.



సంగం మండలంలో పింఛన్ కోసం ఎండలో ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



బ్యాంకు వద్ద పింఛన్ నగదు కోసం క్యూలో ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

ఎన్నికల సమయంలో కుట్రలు

వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను చూసి ఓర్వలేని చంద్రబాబు, ఆయన అనుచరగణం వారిపై పగబట్టి వారి సేవలను అడ్డుకునేలా ఎన్నికల సమయంలో కుట్రలు పన్నారు. వలంటీర్లు ఇలా ప్రజలకు సేవలు అందిస్తే టీడీపీకి నష్టం జరుగుతుందని కుతంత్రాలు చేశారు. చంద్రబాబుకు సంబంధించిన వ్యక్తులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయించారు. కోర్టును ఆశ్రయించారు. దీంతో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ల నగదు పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంపై పింఛన్ లబ్ధిదారులైన అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితరుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో చంద్రబాబు బ్యాచ్ కంగుతింది. తమ ఉసురు చంద్రబాబు, ఆయన అనుచరగణానికి తప్పకుండా తగులుతుందని అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు పాలనలో ఇలా..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పింఛన్ లబ్ధిదారులు ప్రతి నెలా ఆ నగదు కోసం ఎదురుచూడాల్సివచ్చేది. ప్రతి నెల 5వ తేదీ తరువాత పంచాయతీ కార్యాలయంలో పింఛన్ నగదు ఇచ్చేవారు. పింఛన్ డబ్బులు ఇచ్చే అధికారి వచ్చే వరకు అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు క్యూలో నిలబడి పడిగాపులు కాయాల్సివచ్చేది. అధికారి వచ్చి క్యూలో ఉన్న కొంతమందికి మాత్రమే నగదు పంపిణీ చేసి మిగిలిన వారిని మరుసటి రోజు వచ్చి తీసుకోవాలని చెప్పేవారు. ఇలా చంద్రబాబు పాలనలో ఎన్నో అవస్థలు పడిన పింఛన్‌దారులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటి వద్దే పింఛన్ నగదు అందించేలా వలంటీర్లను నియమించి వారి కష్టాలను తీర్చింది.

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

- అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి



తాటిపర్తి హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి

పొదలకూరు: క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి సిబ్బందిని ఆదేశించారు. ఆయన గురువారం పొదలకూరులోని సీహెచ్‌సీని, మహ్మదాపురం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 22 హెల్త్ వెల్నెస్ సెంటర్లలో సిబ్బంది అందరూ క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు వస్తుంటే వెంటనే వారికి క్షయ పరీక్షలు నిర్వహించాలన్నారు. పెద్దలకు టీబీ వ్యాధి రాకుండా బీసీజీ వ్యాక్సిన్ ఈ నెల 16వ తేదీ నుంచి వేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కుష్ఠువ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించాలని తెలిపారు. విరువూరు, తాటిపర్తి హెల్త్ వెల్నెస్ సెంటర్లను డాక్టర్ ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహారావు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ పద్మావతి, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసులు, శబరీనాథ్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి: ప్రతి ఇంటికి సంక్షేమం అందాలంటే అది జగనన్నతోనే సాధ్యమని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పిలుపునిచ్చారు. కావలి పట్టణంలోని మద్దురుపాడు ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందన్నారు. మళ్లీ అలాంటి పరిస్థితే ఉండాలంటే ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై సంక్షేమ పథకాలు అందే పరిస్థితి ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కావలి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరిగిందని తెలిపారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే కావలి నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకుసాగుతుందని తెలిపారు. నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. ప్రజలు వేసే ఓటు రానున్న ఐదేళ్లలో వారి భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని తెలిపారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం కొండాపురం మండలంలోని గరిమెనపెంట, చింతలదేవి, ఉప్పలూరు, గొట్టిగుండాల పంచాయతీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర ప్రజల కష్టాలను స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నవరత్నాల పథకాలను తీసుకొచ్చి ప్రతి పేదవాడికి ఈ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరలా నూతనంగా విడుదల చేసిన మేనిఫెస్టోలోనూ నవరత్నాల పథకాలను కొనసాగిస్తూ లబ్ధిదారులకు మరింత ప్రయోజనం చేకూర్చేలా రూపకల్పన చేశారని తెలిపారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకుంటే పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రతి పథకం ఇంటికే చేరుతుందన్నారు. చంద్రబాబు గతంలో 600 హామీలిచ్చి ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. మరలా ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసేందుకు జనసేన, బీజేపీలతో కలిసి అబద్ధాలు ఆడుతున్నారన్నారు. ప్రజలు దీనిని గమనించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడని, ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను గెలిపించుకుంటే విజయసాయిరెడ్డి ద్వారా ఉదయగిరిని అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యారవ నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు గోపిదేశి యానాదమ్మ, మేకల కొండలరావు, వేమిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, గరిమెనపెంట సర్పంచ్ గున్నా విజయమ్మ, నాయకులు యారవ వెంకటేశ్వర్లు, ముసలారెడ్డి, వీరెళ్ల చంద్రయ్య, తిమ్మారెడ్డి రమణారెడ్డి, శ్రీనివాసులు, మన్నం వెంకటసుబ్బయ్య, ఎడ్లపల్లి వెంకటరమణయ్య, చిమిలి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

పచ్చి అబద్ధాలకోరు చంద్రబాబు

- ఎన్నికల ప్రచారంలో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం

ఆత్మకూరు: వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతరులు చేసిన అభివృద్ధిని సైతం తెలుగుదేశం పార్టీ ఖాతాలో వేసుకొనేందుకు ప్రయత్నించి నవ్వులపాలవుతున్నారు. ఇటీవల ఆత్మకూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలోనూ చంద్రబాబు పలికిన అబద్ధాలే ఇందుకు నిదర్శనం. ఆయన మాట్లాడిన మాటలు, వాస్తవాలను పరిశీలిస్తే..

చంద్రబాబు : సోమశిల జలాశయాన్ని మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పూర్తి చేసిన విషయం మీకు తెలుసు కదా తమ్ముళ్లూ..

వాస్తవం: ఎన్టీ రామారావు తన హయాంలో సోమశిల జలాశయంలో 40 నుంచి 50 టీఎంసీల నీరు నిల్వ చేసేలా కొంతమేర పనులు చేయించారు. అనంతరం 2004లో జలయజ్ఞం పథకంలో భాగంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 78 టీఎంసీల నీరు నిలిచేలా జలాశయం వెనుక ప్రాంతంలోని (వైఎస్సార్ జిల్లా) సుమారు 20 గ్రామాల ప్రజలకు నష్టపరిహారం చెల్లించి కోర్టు కేసులను తప్పించి పనులు పూర్తి చేయించారు. ఆయన హయాంలోనే జలాశయంలో 78 టీఎంసీల నీరు నిలిపి రికార్డ్ సృష్టించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనూ 78 టీఎంసీల నీరు నిలిచేలా (2021) జలాశయానికి పూర్తి చేయాల్సిన మరమ్మతులు చేయించి ఆ మేరకు నీరు నిలిపిన ఘనత దక్కించుకున్నారు. ఇది మరిచిన చంద్రబాబు జలాశయం అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదంగా మారింది.

చంద్రబాబు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కాలువల్లో పూడికతీత పనులు చేశారా.. సాగునీరు ఇచ్చారా తమ్ముళ్లూ..

వాస్తవం : టీడీపీ పాలనలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి తన సొంత నిధులతో జేసీబీ యంత్రాలను ఆత్మకూరు, చేజర్ల, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో ఏర్పాటు చేసి కాలువల్లో పూడికతీత పనులు చేయించారు. ఐఏబీ సమావేశంలో నిర్ణయం మేరకు తొలుత డెల్టాకు, అనంతరం నాన్‌డెల్టాకు సాగునీరు అందివ్వడం పరిపాటిగా ఉండేది. అయితే గౌతమ్‌రెడ్డి జిల్లా ఐఏబీ సమావేశంలో మాట్లాడి డెల్టాతో సమానంగా నాన్‌డెల్టాకు కూడా సాగునీరు అందించారు. అలాగే ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కూడా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేకంగా నిధులు కేటాయించి కాలువల్లో పూడికతీత పనులు చేయించారు. ఆత్మకూరు తూర్పుపాలాలకు సాగునీరు అందించే పంపింగ్ స్కీం మరమ్మతులకు గురైతే ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి రూ.5 లక్షల సొంత నిధులను వెచ్చించి మరమ్మతులు చేయించి ఆ పొలాలకు సాగునీరు అందించారు.

చంద్రబాబు : మెట్ట ప్రాంతాల అభివృద్ధి కోసం హైలెవల్ కెనాల్ నిర్మాణం పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటకెక్కించింది కదా తమ్ముళ్లూ..

వాస్తవం : మెట్ట ప్రాంతాల అభివృద్ధి కోసం నిర్మిస్తున్న హైలెవల్ కెనాల్ నిర్మాణ పనులను దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పలుమార్లు పరిశీలించారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ స్థాయి అధికారులు, ప్రాజెక్ట్ అధికారులతో కలిసి హైలెవల్ కెనాల్ పనులు జరిగే గ్రామాల్లోనే ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పనులు వేగవంతం అయ్యేలా చేశారు. అయితే 2015 నుంచి 2018 వరకు టీడీపీ పాలనలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఆనం రామనారాయణరెడ్డి హైలెవల్ కెనాల్ పనుల ఊసేఎత్తని విషయాన్ని ప్రజలు గుర్తుచేస్తున్నారు.

చంద్రబాబు : ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరును అభివృద్ధి చేశారు.. నిజమా.. కాదా.. తమ్ముళ్లూ..

వాస్తవం : దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో, అనంతరం రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ఆత్మకూరులో కొన్ని భవనాలు, మున్సిపాలిటీ ఏర్పాటు తదితర పనులు జరిగాయి. అవి తెలుగుదేశం పార్టీకి సంబంధం లేకపోయినప్పటికీ చంద్రబాబు తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా



మర్రిపాడు: మండలంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారి అల్లంపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం తెల్లవారుజామున సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సిమెంట్ ట్యాంకర్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. నిద్రమత్తే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. కృష్ణపట్నం పోర్టు నుంచి బళ్లారి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకువస్తే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని ఎండీ ఖలీల్ అహ్మద్ అన్నారు. నగరంలోని 6వ డివిజన్ జీనిగలవీధి, పప్పులవీధి ఆంజనేయస్వామిగుడి రోడ్డు, వైవీఎం స్కూల్ వీధి, అరుంధతీయపాళెం, 8వ డివిజన్ ముకుందాపురం, ఆర్కేనగర్, బుజ్జమ్మతోట, గాండ్లవీధి, 39, 40వ డివిజన్‌లకు సంబంధించి రామిరెడ్డి బంగ్లా, చమండివారితోట, రావిచెట్టుసెంటర్, యాదవవీధి, ధర్మరాజుగుడివీధి, పల్లిమిట్ట, అలంకార్‌సెంటర్, బ్రాహ్మణవీధి, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రజలకు మంచి జరగాలన్న లక్ష్యంతో జగనన్న నూతన మేనిఫెస్టోకు రూపకల్పన చేసి విడుదల చేశారని తెలిపారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. జిల్లాను ఏవిధంగా అభివృద్ధి చేస్తారో మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు తెలిపారు. నాలుగున్నరేళ్ల ప్రజలకు కనిపించకుండా వెళ్లి ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో ప్రజల వద్దకు వెళ్లి నగరాన్ని అభివృద్ధి చేశానంటూ నారాయణ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నారాయణ ఆస్పత్రిలో గానీ, విద్యాసంస్థల్లో గానీ ఏ ఒక్కరికైనా ఉచిత వైద్యం, విద్య అందించారా అని ప్రశ్నించారు. తనకు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చారని తెలిపారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మద్దినేని మస్తానమ్మ, మొగళ్లపల్లి కామాక్షీదేవి, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, 40వ డివిజన్ ఇన్‌చార్జి మానికల సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు దొంతాలి రఘు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్‌అహ్మద్

టీడీపీ నేతల బరితెగింపు

- కోవూరులో రెచ్చిపోతున్న పచ్చ మూకలు
- విడవలూరు మండలం పార్లపల్లిలో ముస్లింల మనోభావాలపై దాడి
- నూతనంగా నిర్మించుకుంటున్న మసీదును కూల్చేసిన దుండగులు
- టీడీపీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మైనారిటీలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోవూరు నియోజకవర్గంలో టీడీపీ గ్రాఫ్ పడిపోతుండడంతో ఆ పార్టీ నేతలు అలజడి సృష్టిస్తున్నారు. ప్రశాంతమైన గ్రామాల్లో రాజకీయ కక్షలకు ఆజ్యం పోస్తున్నారు. ఎన్నికల వేళ టీడీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నోట్ల కట్టలతో వలస నేతలను సంతలో సరుకులా కొనుగోలు చేసినా క్షేత్రస్థాయిలో ఓటర్లు మాత్రం అమ్ముడుపోయిన నేతలను ఛీదరించుకుంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే జై కొడుతున్నారు. దీంతో ఓటమి భయం పట్టుకున్న పచ్చనేతలు గ్రామాల్లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా విడవలూరు మండలం పార్లపల్లిలో టీడీపీ నేతలు ముస్లింల మనోభావాలను దెబ్బతీశారు. వారు పవిత్రంగా భావించే మసీదును కూల్చివేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పార్లపల్లిలో ముస్లింలకు ప్రార్థనా మందిరానికి (మసీదుకు) శాశ్వత భవనం లేక స్థానికంగానే పాకలో ప్రార్థనలు చేసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు నుంచే శాశ్వత భవనం ఏర్పాటు చేసుకుందామని భావించి స్థానికంగా అందరికీ ఆమోదయోగ్యమైన స్థలంలో మసీదు నిర్మాణానికి పూనుకున్నారు. ముస్లింలతోపాటు కొందరు దాతల సాయంతో నిర్మాణం ప్రారంభించుకున్నారు. ఎన్నికల వేళ ఆ గ్రామంలో ముస్లింలందరూ వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులుగా ఉండడంతో జీర్ణించుకోలేని స్థానిక టీడీపీ నేతలు మసీదు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించుకుంటున్నారని సాకు చూపి అధికారులను పంపి నిర్మాణాన్ని నిలిపివేసే ప్రయత్నాలు చేశారు. కానీ ముస్లింలందరూ ఏకం కావడంతో అధికారులు మిన్నకుండిపోయారు. టీడీపీ నేతలు పన్నిన కుట్రలు ఫలించకపోవడంతో రాత్రికి రాత్రే నూతన నిర్మాణ భవనాన్ని కూల్చివేశారు. ఎవరో గుర్తుతెలియని దుండగలు చేసినట్లుగా కట్టుకథ అల్లారు. ఈ ఘటనకు సంబంధించి తమ మనోభావాలను దెబ్బతీసిన టీడీపీ నేతలపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేసి విడవలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నేతపై అనుమానం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రంగంలోకి దిగిన వేమిరెడ్డి

పార్లపల్లిలో జరిగిన ఘటన వెలుగులోకి వస్తే జిల్లాలో పెద్ద అలజడి రేగుతుందని భావించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన అనుచరుల ద్వారా ముస్లింలతో రాయబారాలు నడిపినట్లు తెలిసింది. ఎన్నికల తర్వాత మసీదు నిర్మాణం చేయిస్తానంటూ వారిని ఒప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడమే ఇందుకు నిదర్శనం.



టీడీపీ నేత కూల్చివేసిన మసీదు